# ఆమె నవ్వింది

◆ టి. శ్రీవల్లీ రాధిక ◆

**ఉదయిస్తూన్న సూర్యుడి లేతకాంతిలో, ఒళ్ళు విరుచుకుంటూ నిద్రలేస్తూన్న బస్‌స్టాప్... శుభ్రతనీ, సౌందర్యాన్నీ మర్చిపోయిన బాలింతరాలిలా వుంది.**

పుస్తకాలగోతాలు మోస్తూన్న బడిపిల్లల్నీ, ఎందుకు తెల్లవారిందా అని ఏడుస్తూన్న చిరుద్యోగుల్నీ కూడా వదలకుండా అదుక్కుంటున్నాడు వాడు, తన హక్కులేమిటో తనకు క్షుణ్ణంగా తెలిసిన పౌరుడిలాగా.

మరో ప్రక్కన... సీతాకోకచిలుకల్లా తయారయి వచ్చిన కాలేజీ అమ్మాయిలు... ఎక్కడ పెడితే తమ పాదాలకు తక్కువ మురికి అంటుతుందో అర్థం కాక సతమతమవుతున్నారు.

ఎవరెవరో వస్తున్నారు, వెళ్తున్నారు. సునీల్ ఎవరికోసం ఎదురు చూస్తున్నాడో... 'ఆమె' మాత్రం రాలేదు.

అప్పటికి గంటయింది అతను బస్‌స్టాప్‌కి వచ్చి. రెండు బస్‌లు వెళ్ళిపోయాయి. అయినా 'ఆమె' రాకపోవడం ఆశ్చర్యంగా వుంది.

ఏమైనా ఈ రోజు మిస్ అయ్యే అవకాశం మాత్రం లేదు. ఎందుకంటే ఫస్ట్ బస్ టైమ్‌కే వచ్చి నిలుచున్నాడు అతను.

మొదటి రెండు బస్‌లకీ రాలేదంటే యిక ఈ బస్‌కి తప్పకుండా వస్తుందన్నమాట. వారం రోజుల నుండీ చూస్తున్నాడు. 'ఆమె' ఏ బస్‌లో వెళ్ళిపోతోందో అర్థం కావడం లేదు. తను పడ్డ కష్టాలు తల్చుకుంటే తన మీద తనకే జాలివేసింది సునీల్‌కి.

ఏం లాభం! ఆమె దర్శనం మాత్రం కాలేదు. తను పడ్డ కష్టాలన్నిటికీ ప్రతిఫలంగా, ఆమె తనని చూసి ఒక్కసారి నవ్వితే చాలు అనిపిస్తోంది సునీల్‌కి.

ఆమె కోసం వెయిట్ చేస్తూ నిన్న ఎగ్జామ్ మిస్ చేసుకున్నాడు. ఎగ్జామ్ అంటే రాసినా రాయకపోయినా యింట్లో వాళ్ళకి తెలియదు.

కానీ బస్‌పాస్... అది కూడా చేయించుకోలేదు. ఇక ఈ నెల అంతా టికెట్ కొనుక్కుని వెళ్ళాలంటే... డబ్బులెలాగో!

అసహనం తన్నుకురావడంతో, బస్‌స్టాప్‌లోని యినుపరాడ్‌ని ఒకసారి విసురుగా తన్నాడు, తన ఖరీదైన షూస్‌తో.

సరిగ్గా అప్పుడే కనిపించింది ఆమె... దూరంగా... మెరుపు మెరిసినట్లు.

కళ్ళార్పడం కూడా మర్చిపోయి చూశాడు సునీల్. చాలా సాధారణంగా అలంకరించుకుంది. అయినా అంత తేజస్సు ఎలా వస్తూందో!

ఒంటి మీద ఎక్కడా రవ్వంత బంగారం లేదు. కానీ తనే ఓ పోతపోసిన బంగారు బొమ్మలా మెరిసిపోతోంది.

నల్లటి చీరకుచ్చెళ్ళ చాటునుంచి కనబడుతూ, మాయమవుతూ, దాగుడు మూతలాడుతున్నాయి.... మల్లెపూల లాంటి పాదాలు.

అలా... ఆ పాదాలని చూస్తూ ఎన్ని సంవత్సరాలైనా గడిపేయవచ్చుననిపించింది సునీల్‌కి.

అక్కడెక్కడో... ఎవర్నో... ఆమె నవ్వుతూ పలకరిస్తుంటే... ఇక్కడ తన మీద పూలవర్షం కురిసినట్లనిపించింది.

ఇంతలో ఏదో బస్ వచ్చి తన ప్రక్కన ఆగిందనిపించింది. అనిపించడం కాదు... నిజంగానే వచ్చింది.

ఆ అమ్మాయి బస్ ఎక్కుతుంటే, అప్పుడే స్పృహ వచ్చినట్లుగా కదిలాడు సునీల్.

బస్ కదిలిపోతూంటే... యిక లాభం లేదని, ముందు వైపుకు వెళ్ళి ఎక్కేశాడు. డ్రైవర్ తిట్టాడు. తను మీదుగా లోపలికి వెళ్తూంటే ఆడవాళ్ళు శాపనార్థాలు పెట్టారు.

పద్మవ్యూహంలోకి వెళ్తున్న అభిమన్యుడిలా వెళ్ళిపోయి, ఆ అమ్మాయి కూర్చున్న చోటుకి చేరాడు. అక్కడ అంతగా రష్ లేదు.

కుదుటపడ్డ మనసుతో ఆమె సీట్ ప్రక్కనే వున్న రాడ్‌కి ఆనుకుని నిలబడ్డాడు.

ఆమె మాత్రం బస్‌లో కూర్చోవడం ఆలస్యం, ఏదో పుస్తకం తీసి చదువుకోసాగింది. ఆ ధోరణి చూసి సునీల్‌కి చెప్పలేనంత

● ● ●

ఆమె తనని చూసి ఒక్కసారి నవ్వితే చాలు అనిపిస్తోంది సునీల్ కి.

● ● ●

రోషం వచ్చింది. "ఏమిటో అంత సీరియస్‌నెస్! ఒక్కసారి నావైపు చూడకూడదూ! చల్లని నవ్వుతో వలకరించకూడదూ!" అనుకున్నాడు.

నడన్‌బ్రేక్ వేయడంతో ఆమె ప్రక్కకు తిరిగి బాలెన్స్ చేసుకుంది. ఆమె చెవికి వున్న లోలకులు వత్తుకుని అతని చేతిమీద ముద్ర పడింది. చిన్నగా గీసుకుపోయింది.

"ఈ జీవితానికి ఈ ఆనందం చాలు" అనుకున్నాడు సునీల్.

అదే క్షణంలో కండక్టర్ వచ్చాడు... ఆ ఆనందాన్ని పాడుచేసే రాక్షసుడిలా...'టికెట్' అంటూ.

జేబులో నుండి అయిదురూపాయలు తీసి యిచ్చి, ఎక్కడికి వెళ్లాలో చెప్పాడు సునీల్. టికెట్‌తో పాటు వచ్చిన చిల్లరని జేబులో వేసుకోబోతూ వుండగా... ఒక కాయిన్ పడిపోయింది.

పడటం పడటమే దొర్లుకుంటూ పోయి, అవతలి ప్రక్క సీట్‌కి అరంగుళం యివతల ఆగింది. అతను వంగి తీసుకోబోయాడు. అవుడే ఆమె యిటు తిరిగి అతనిని చూసింది. క్షణంలో వెయ్యోవంతులో వంగే ప్రయత్నం విరమించుకున్నాడు సునీల్. స్ట్రెయిట్‌గా నిలుచున్నాడు.

"అవును మరి. ఎవుడూ ఎవరినీ పట్టించుకోని ఆమె... చూడక, చూడక తనవైపు చూస్తే... తన అనహ్యంగా, వంగుని, ఆడ్ ఫోజ్‌లో కనిపిస్తే ఎలా! పోతేపోయింది వెధవ అర్ధరూపాయి. అనలింతకీ అది అర్ధరూపాయా! రూపాయా!

రూపాయి అయితే కష్టం. వచ్చేటవుడు టికెట్‌కి డబ్బులు చాలవు."

ఆమె మొహం త్రిప్పేసుకుంది. సునీల్ ఓరగా కాయిన్ పడిన వైపు చూశాడు.

అది అక్కడే వుంది. అర్ధరూపాయి కాదు. రూపాయే. అతను వంగబోయేంతలో ఆమె మళ్ళీ తలత్రిప్పి చూసింది.

సునీల్ కంగారుగానూ, యిబ్బందిగానూ నవ్వి స్ట్రెయిట్‌గా నిలుచున్నాడు. ఆమె కళ్ళలో ఆశ్చర్యం కనిపించింది. మరో రెండుసార్లు అతని వైపు అనుమానంగా చూసింది.

"భగవంతుడా..." అనుకున్నాడు సునీల్. "పోనీ తరువాత తీసుకుందాంలే అంటే... ముందు సీట్‌లో కూర్చున్న ఓ చింపిరి జుట్టు పిల్ల ఈ తంతు అంతా చూస్తూనే వుంది. ఏ క్షణంలో వంగి, ఆ రూపాయి కొంగుకు కట్టుకుంటుందో!"

ఆలోచిస్తున్న అతనికి ఏదో అయిడియా వచ్చింది. తన తెలివికి తానే మురిసిపోతూ, ఎడమకాలుని కొద్దిగా జరిపి, ఆ కాయిన్ మీద పెట్టాడు. చింపిరి జుట్టు పిల్ల ఒకసారి అతని మొహంలోకి చూసి, మళ్ళీ తల దించుకుంది.

కానీ ఏం చేస్తాడు! ప్రేమికులవ్వాక ఆ మాత్రం పరీక్షలు తప్పవు. అందుకే ఆమెని చూస్తూ తన బాధని మర్చిపోయే ప్రయత్నం చేయసాగాడు.

ఆమె మాత్రం ప్రక్కనున్న ముసలావిడతో కబుర్లు చెవుతూంది. తన, బాధని రవ్వంత అయినా పట్టించుకోకుండా.

ముసలావిడ మెచ్చుకుంటోంది. సునీల్‌కి మాత్రం గుండెల్లో రాయి వడింది. "పార్ట్‌టైం జాబా! రోజూ యింత ప్రొద్దున్నే బయలుదేరి వెళ్తుందా! అంటే తను కూడా యింత త్వరగా



రావాలా! యింపాసిబుల్. ఏదో ఒక రోజంటే లేచాడు కానీ, రోజూ యింత ప్రొద్దున్నే నిద్రలేవడం తన వల్ల కాదుగాక కాదు."

అతని సహనానికి పరీక్ష పెడుతూన్నట్లూ, కండక్టర్ వచ్చాడు. బస్ అంతా నాదే అన్నట్లుగా నిలుచున్న సునీల్‌ని ఆశ్చర్యంగా చూసి, "ప్రక్కకి జరగ"మన్నాడు.

పాపం. జరగడానికి సునీల్‌కి కూడా అభ్యంతరం లేదు. కానీ ఎటుప్రక్కకి జరుగుతాడు? కుడివైపా! ఎడమవైపా!

కుడివైపు జరిగితే, కాయిన్ మీద నుంచి కాలు తీయాలి. ఎడమవైపు జరిగితే...

వెనకాల వున్న డబ్బా మొహం ముసలాడ ఆమె ప్రక్కకి వచ్చి నిలబడతాడు.

క్షణంలో వెయ్యో వంతులో నిర్ణయం తీసుకున్నాడు సునీల్. రూపాయికి త్యాగం చేసి (టెంపరరీగా) కుడివైపుకు జరిగాడు.

అంతే. ముందు సీట్లోని పిల్ల టకీమని వంగింది. రూపాయి తీసుకుని నడుముకి కట్టుకున్న నంచీలో వేసేనుకుంది.

"ఆ రూపాయి నాది, యిచ్చేయి" అని అడుగుదామనుకున్నాడు.

మళ్ళీ అంతలోనే అనిపించింది. "వెధవ రూపాయి. ముష్టి రూపాయి... దాని కోసం బాధవడటమేమిటి, లేకి వెధవలా! ఆమె చూస్తే ఏమనుకుంటుంది!" అని.

"రూపాయి పోతే-పోయింది కానీ, నిజానికి ఈ రోజు చాలా బాగుంది. వారం రోజులుగా కనవడని ఆమె యివాళ కనవడింది. ఇలా ఆమె ప్రక్కనే నిలబడే అవకాశం వచ్చింది. ఎవుడూ కన్నెత్తి చూడని ఆమె, ఈరోజు తనని నాలుగుసార్లు చూసింది. ఇంక కాసేపయితే-తన చిరకాల కోరిక తీరేలా... తనని చూసి నవ్వుతుందేమో! ఏమో! ఎవరు చెప్పొచ్చారు. ఒక్కొక్కసారి అద్భుతాలు జరుగుతాయి.... నిజంగా అదే జరిగితే తన జీవితం ధన్యమయినట్లే..."

సునీల్ ఆలోచనలలో నుండి తేరుకోకముందే ఆమె దిగవలసిన స్టాప్ వచ్చింది. లేచి ముందుకు వెళ్తూ, కండక్టర్‌ని అడుగుతోంది ఆమె "నాకు వదిపైసలు యివ్వాలి. ఇస్తారా!" అని.

సునీల్ చూస్తూనే వున్నాడు. కండక్టర్ యిచ్చిన చిల్లర వర్స్‌లో వేసుకుంటూ ఆమె దిగిపోయింది.

ఆఖరి మెట్టు మీద నుండి దిగేముందు మాత్రం ఒక్కసారి వెనక్కు తిరిగింది... క్షణంలో వెయ్యోవంతూ, చిన్నగా నవ్వింది.

సునీల్ వులిక్కివడ్డాడూ. "ఎవరిని చూసి నవ్విందామె! నన్ను చూసేనా!" అనుకున్నాడు.

నందేహమెందుకు! అతనిని చూసే... అతనిలా బాధ్యత తెలియని వాళ్ళని ఎంతోమందిని చూసే... ఆమె నవ్వింది... అవహాస్యంగా. ◆